www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 జులై 2024

జిల్లాలో పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులపై వర్షపు నీరు నిలిచింది. గుంతల్లో నీరు నిలవడంతో జనం రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

నరసాపురం: జిల్లాలోని పలు మండలాల్లో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. అత్యధికంగా నరసాపురం 64.2 మిల్లీమీటర్లు, తణుకులో అత్యల్పంగా 9.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాలకోడేరు 50.8, వీరవాసరం 50.6, పాలకొల్లు 50.2, భీమవరం 40.4, తాడేపల్లిగూడెం 38.2, మొగల్తూరు 35.2, ఉండి 33.4, పెంటపాడు 26.2, యలమంచిలి 24.2, కాళ్ల 23.2, పోడూరు 19.4, ఇరగవరం 19, అత్తిలి 16.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మొత్తం 20 మండలాల్లో సగటు వర్షపాతం 28.5 మిల్లీమీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పరిహారం లేదు.. పరిశ్రమా లేదు..!

- వట్లూరులో భూములు కోల్పోయిన రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- టిడిపి ప్రభుత్వం రావడంతో వెమ్ టెక్నాలజీ ఏర్పాటుపై చర్చ
- అప్పట్లో రైతుల నుంచి 340 ఎకరాలు స్వాధీనం
- ఎకరాకు రూ.2.50 లక్షల పరిహారం ఇస్తామని హామీ
- ఎనిమిదేళ్లు గడిచినా చిల్లిగవ్వ ఇవ్వని దుస్థితి
- మా భూములు మాకివ్వాలంటున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు పేరుతో వట్లూరులో రైతుల నుంచి సేకరించిన భూములకు ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వలేదు. పరిశ్రమ నెలకొల్పలేదు. టిడిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో పరిశ్రమ ఏర్పాటుపై మళ్లీ చర్చ సాగుతుండగా తమకు పరిహారమైనా ఇవ్వండి, లేకపోతే భూములైనా ఇచ్చేయండని రైతులు గగ్గోలు పెడుతున్నారు. 2014లో టిడిపి ప్రభుత్వం గెలిచిన తర్వాత ప్రతి జిల్లాలోనూ భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని చెప్పింది. అందులో భాగంగా 2016లో వట్లూరులో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. పరిశ్రమ ఏర్పాటుకుగాను పెదపాడు మండలం వట్లూరు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 495, 496, 497లోనూ, పెదవేగి మండలంలోని సర్వే నెంబర్ 210-29 పరిధిలోని దాదాపు 340 ఎకరాలను వెమ్ టెక్నాలజీ సంస్థకు ఎపిఐఐసి ద్వారా ప్రభుత్వం కేటాయించింది. ఈ భూములను దశాబ్దకాలం నుంచి అక్కడి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇవి ప్రభుత్వానికి చెందిన చెరువు భూములంటూ ప్రభుత్వం బలవంతంగా లాగేసుకుంది. దీంతో రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో వెనక్కి తగ్గిన పాలకులు ఇవి ప్రభుత్వ భూములు కాబట్టి ఎకరాకు రూ.2.50 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ సమయంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ రైతులకు, ప్రభుత్వానికి మధ్య రాయబారం నడిపి ఒప్పించారు. అప్పట్లో ఉండి ఎంఎల్ఎగా ఉన్న వేటుకూరి వెంకట శివరామరాజు కుటుంబ సభ్యులకు సంబంధించి ఈ భూముల కేటాయింపు జరిగింది. అప్పట్లో సిఎంగా ఉన్న చంద్రబాబు వెమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమానికి స్వయంగా హాజరయ్యారు. శంకుస్థాపన స్థాపన వ్యవహారం అట్టహాసంగా సాగించారు. తర్వాత మూడేళ్లపాటు టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ పరిశ్రమ ఏర్పాటు కాలేదు. రైతులకు సైతం పరిహారం ఇవ్వలేదు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశ్రమ ఏర్పాటు పూర్తిగా అటకెక్కేసింది.

భూములైనా ఇవ్వండి.. పరిహారమైనా చెల్లించండి

దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్న భూములు తీసుకున్న ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వకపోవడంపై రైతుసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద రైతులు అప్పట్లో పెద్దఎత్తున ఆందోళన సాగించారు. అప్పటి టిడిపి ప్రభుత్వంగాని, తర్వాత వైసిపి సర్కార్‌గాని రైతుల గోడు పట్టించుకోలేదు. దాదాపు ఎనిమిదేళ్లు గడిచిపోయింది. పరిశ్రమ ఏర్పాటు చేయకపోవడంతో 2022 ఏప్రిల్‌లో ఈ భూములను వెమ్ టెక్నాలజీ సంస్థ నుంచి ఎపిఐఐసి స్వాధీనం చేసుకుంది. ఈ భూములు ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయి. రైతులకు తిరిగివ్వలేదు. ఎంతోమంది రైతులు తమ పిల్లలకు వివాహాలు చేస్తున్నప్పుడు ఆ భూములను లాంఛనాలుగా ఇచ్చారు. దీంతో ఆయా రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. టిడిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో పరిశ్రమల ఏర్పాటు తమ ప్రథమ ప్రాధాన్యం అంటూ చెబుతోంది. దీంతో వట్లూరు భూముల్లో ఏదైనా పరిశ్రమ ఏర్పాటు చేసే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. దీంతో మాకు పరిహారమైనా ఇవ్వండి.. లేకపోతే.. భూములైనా ఇచ్చేయండని రైతులు కోరుతున్నారు. 2016లో అప్పటి ధరలను బట్టి ఎకరాకు రూ.2.60 లక్షలు పరిహారం ఇస్తామని చెప్పారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ అంశాన్ని సైతం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందనే చర్చ నడుస్తోంది. అప్పట్లో రైతులకు, ప్రభుత్వానికి మధ్య రాజీ కుదిర్చిన చింతమనేని ప్రభాకర్ మళ్లీ ఎంఎల్‌ఎగా గెలిచారు. ఆయన రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

కలెక్టర్ సి.నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పిఎంఎవై, టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో ఆమె గృహనిర్మాణం, టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో జిల్లాలోని గృహ నిర్మాణాలపై సమీక్షించారు. జిల్లాలో పిఎంఎవై అర్బన్ కింద 70,119 ఇళ్లు మంజూరవ్వగా 45,843 ఇళ్ల నిర్మాణం కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకూ 29,256 ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో జిల్లా 64 శాతం ప్రగతితో మూడోస్థానంలో నిలిచిందన్నారు. పిఎంఎవై గ్రామీణ్ కింద 3,673 ఇళు మంజూరవ్వగా 3,290 ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని, ఇప్పటి వరకు 1,803 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు. రాష్ట్రంలో జిల్లా 55 శాతం ప్రగతిలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. గృహ నిర్మాణాలకు ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రెండు దశల్లో జిల్లాకు మొత్తం 21,424 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మొదటి విడతలో భీమవరం 8,352, తాడేపల్లిగూడెం 5,376, పాలకొల్లు 6,144 మొత్తం 19,872 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వాటిలో భీమవరంలో 2,944, తాడేపల్లిగూడెంలో 3,232, పాలకొల్లులో 2,560 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. భీమవరంలో 5,408, తాడేపల్లిగూడెంలో 2,144, పాలకొల్లులో 3,584 మొత్తం 11,136 ఇళ్ల నిర్మాణం 90 శాతానికిపైగా పూర్తయినట్లు తెలిపారు. రెండో విడతలో తణుకు పట్టణంలో 912 ఇళ్లు మంజూరవ్వగా నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు సాధ్యమైనంత త్వరగా అందజేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జి హౌసింగ్ జిల్లా అధికారి జి.పిచ్చయ్య, ఇఇ బి.వెంకటరమణ, టిడ్కో ఇఇ ఎంఎస్.స్వామినాయుడు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - వీరవాసరం

సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ఉమామహేశ్వరరావు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఆయన శుక్రవారం నందమూరుగరువులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సందర్శించారు. అనంతరం ఫ్రైడే డ్రైడేను పురస్కరించుకుని గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పారిశుధ్యంపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి తాజ్, సిహెచ్ఒ దేవదాసు, భారతి, చిట్టిబాబు పాల్గొన్నారు.

నందమూరుగరువులో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరావు

ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ సి.నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లాలో కొనసాగుతున్న ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆమె నేషనల్ హైవేస్ అధికారులతో సమావేశమై ఎన్‌హెచ్ 165, ఎన్‌హెచ్ 216 ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పామర్రు నుండి ఆకివీడు మీదుగా దిగమర్రు వరకు ఎన్‌హెచ్-165 నిర్మాణం 104 కిలోమీటర్లు కొనసాగుతుందన్నారు. పామర్రు నుండి ఆకివీడు వరకు 64 కిలోమీటర్ల పరిధిలో నిర్మాణ పనులు సాగుతున్నాయని, ఆకివీడు నుండి భీమవరం మీదుగా దిగమర్రు చేరుకునే 40 కిలోమీటర్ల రహదారిలో 17 కిలోమీటర్ల పరిధిలో పనులు చేపట్టాల్సి ఉందని అన్నారు. దీనికోసం భీమవరం బైపాస్ ప్రాంతంలోని ఆరు కిలోమీటర్ల పరిధిలో భూసేకరణ పనులను వేగవంతం చేయాలని భీమవరం ఆర్‌డిఒను కలెక్టర్ సూచించారు. అలాగే కత్తిపూడి నుండి ఒంగోలు ఎన్‌హెచ్-216 నరసాపురం, దిగమర్రు మీదుగా లోసరిని కలుపుతూ వెళ్లే మార్గమధ్యంలో మొగల్తూరు మండలం కాళీపట్నం వద్ద నేషనల్ హైవే ప్రాంతంలో సీపేజ్ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఎన్‌హెచ్ అధికారి వివరణిస్తూ స్థానిక నివాస ప్రాంతాల నుండి సీపేజ్ వస్తున్నట్లు గమనించామన్నారు. ఆ గ్రామ ప్రజలతో గ్రామ సభ ఏర్పాటు చేసి పరిస్థితి వివరించి తదుపరి చర్యలను తీసుకోవాలని కలెక్టర్ ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, విజయవాడ నుండి ఆర్‌అండ్‌బి ఎస్ఇ సత్యనారాయణ, ఆర్‌అండ్‌బి ఎన్‌హెచ్ ఇఇ సంజీవరాయుడు, కాకినాడ నుండి ఎన్‌హెచ్ సబ్ డివిజన్ డిప్యూటీ ఇఇ ఎల్‌ఎస్.సుబ్రహ్మణ్యం, సహాయ ఇంజినీర్లు ఎన్.వెంకటరత్నం, కె.పురుషోత్తం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

రహదారుల ప్యాచ్‌వర్క్ వెంటనే చేపట్టాలి

జిల్లాలో ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ రహదారుల ప్యాచ్‌వర్క్ వెంటనే చేపట్టి ప్రమాదాలను నివారించాలని కలెక్టర్ సి.నాగరాణి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆమె ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో జిల్లాలోని రహదారుల స్థితిగతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రహదారుల్లో గుంతలను వెంటనే పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గుంతలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని, దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి మరమ్మతులు చేపట్టాలని అన్నారు. నిర్మాణంలో ఉన్న రహదారులను వేగవంతంగా పూర్తి చేయాలని, కల్వర్టుల మరమ్మత్తులపై శ్రద్ధ వహించాలని అన్నారు. జిల్లాలో అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఆర్‌అండ్‌బి అధికారి ఎల్.లోకేశ్వరరావు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు సేవల్లో లోపం రానీయొద్దు

మూగజీవాలకు అందించే సేవల్లో ఎట్టి పరిస్థితుల్లో లోపం రానీయొద్దని కలెక్టర్ సి.నాగరాణి పశుసంవర్ధక శాఖాధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆమె పశుసంవర్ధక శాఖాధికారులతో సమావేశమై ఆ శాఖలో కొనసాగుతున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మూగజీవాలకు ఉత్తమ సేవలందించాలని, విధులను అంకితభావంతో నిర్వహించాలని అన్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం జిల్లాలో 2,23,676 ఆవులు, గేదెలు, 61,569 గొర్రెలు, 43,04,397 మేకలు, పందులు, బాతులు, నాటు కోళ్లు, బాయిలర్, ఫారం కోళ్లు ఉన్నాయన్నారు. 31 సెంటర్లలో టాయిలెట్లు అవసరం ఉన్నాయని పశుసంవర్ధక శాఖాధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. చాలా ఆసుపత్రులు మరమ్మతుల దశలో ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ నిధులు మంజూరుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పశుసవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ జవహర్ హుస్సేన్, డాక్టర్ ఎల్‌కె.సుధాకర్, డాక్టర్ జి.జేసురత్నం, టెక్నికల్ ఆఫీసర్ నోయల్, సహాయ సంచాలకులు, ఏరియా పశు వైద్యశాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యాన కరపత్రాలను పంపిణీ చేస్తున్న న్యాయవాదులు

కొత్త క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - తణుకు

పౌర హక్కులకు, స్వేచ్ఛకు, వాక్ స్వాతంత్రానికి భంగం కలిగించే కొత్త చట్టాలను వెంటనే నిలుపుదల చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఐలు ఆధ్వర్యంలో కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కరోనా సమయంలో ఎటువంటి చర్చా జరపకుండా పార్లమెంట్‌లోని 140 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి క్రిమినల్ చట్టాలను బిజెపి ప్రభుత్వం ఆమోదింపజేసిందన్నారు. గత కాలంలో పోలీస్ కస్టడీకి ఏ వ్యక్తికైనా 15 రోజులు రిమాండ్ విధించేవారని, ప్రస్తుతం కొత్త చట్ట ప్రకారం 40 రోజుల నుండి 90 రోజుల వరకు పోలీస్ కస్టడీలో ఉండే అవకాశం ఉందని అన్నారు. కొత్త చట్టాలపై ప్రజల్లోనూ, న్యాయవాదులతోను ముందుగా చర్చించాలని, చర్చకు వచ్చిన అంశాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి చట్టాలను మార్పు చేయాలని మునిస్వామి అన్నారు. పూర్వం బ్రిటీష్ వారు రాజద్రోహం అంటే దానిని సుప్రీంకోర్టు రద్దు చేయాలని చెప్పినా పేరు మార్చి దేశద్రోహంగా కొత్త చట్టంలో పెట్టారని తెలిపారు. దీనివల్ల అధికారంలో ఉన్నవారు కక్షసాధింపు చర్యగా కేసులను పెట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ చట్టాలను వెంటనే నిలుపుదల చేయాలని, లేకుంటే న్యాయవాదులు ప్రజాక్షేత్రంలో ప్రజల భాగస్వామ్యంతో పోరాటాలు ఒక్కటే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, న్యాయవాదులు బివివి.విక్టర్‌బాబు, పి.ప్రతాప్‌కుమార్, నెహ్రు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

రూ.10 కోట్లతో లింకు రోడ్లు నిర్మాణం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మార్కెట్ యార్డులో ఏడాదికి రూ.రెండు కోట్లతో అనుసంధాన రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పడాలలో మార్కెట్ యార్డును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్లలో రూ.10 కోట్లతో లింకు రోడ్లు నిర్మిస్తామన్నారు. అవసరమైతే సిఎం చంద్రబాబును మరిన్ని నిధులు కోరతామన్నారు. అధికారులు రైతాంగ శ్రేయస్సు కోసం పని చేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేస్తామని, ఏమైనా తేడాలుంటే ఉపేక్షించేది లేదని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి గ్రేడ్-1 కార్యదర్శి ఎంఎన్‌వి.ప్రభాకర్, నాయకులు ఉన్నారు.

హెల్మెట్ ధరించకపోతే కఠిన చర్యలు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇకపై ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ట్రాఫిక్ సిఐ కె.శ్రీనివాసరావు, ఆర్‌టిఒ కె.శ్రీహరితో కలిసి హైకోర్టు ఆదేశాలననుసరించి ద్విచక్ర వాహనదారుల భద్రతకు సంబంధించి మీడియా సమావేశం నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 3703 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా వారిలో 3042 మంది హెల్మెట్ ధరించకపోవడమే కారణమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించి ప్రయాణం సాగించాలన్నారు. యువత ద్విచక్ర వాహనాలు అతివేగంగా నడపడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలకు గురై మరణిస్తున్నారన్నారు. కుటుంబ యజమాని, యువత, ముఖ్యంగా విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని అన్నారు. రవాణా, పోలీస్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేసి హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేయడానికి చర్యలు చేపడతారని తెలిపారు. ట్రాఫిక్ సిఐ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు వాహనాన్ని నడిపేటప్పుడు తన ప్రాణాన్నే కాకుండా తన కుటుంబ సంక్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని వాహనం నడపాలని, దీనికి సంబంధించిన భద్రతా మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని అన్నారు. ఆర్‌టిఒ కె.శ్రీహరి మాట్లాడుతూ వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించడంతోపాటు అతివేగాన్ని నియంత్రించుకోవాలని కోరారు. వీటిని ధిక్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పింఛను సొమ్ముతో పరారైన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని లంకలకోడేరు సచివాలయం-2లో గ్రేడ్-5 సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న బి.రాము ఈ నెల ఒకటో తేదీన పింఛన్ సొమ్ములతో పరారైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా సెల్ సిగ్నల్ ద్వారా హైదరాబాద్‌లో రామును పట్టుకుని శుక్రవారం అధికారుల ముందు హాజరుపర్చారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాము పాలకొల్లులో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అతను క్యాసినో గేమ్ ద్వారా గతంలో చాలా డబ్బులు పోగొట్టుకున్నాడు. అయితే జులై 1వ తేదీన పంచాల్సిన పెన్షన్ సొమ్ము రూ.2 లక్షల 50 వేల 500 ఈ గేమ్ ద్వారా పోగొట్టుకున్నాడు. ఈ విషయం అధికారులకు తెలుస్తుందని పారిపోయాడు. తోటి ఉద్యోగుల దగ్గర సైతం అప్పులు తీసుకున్నాడు. విచారణలో సిఐ కె.సతీష్, ఎస్ఐ హరికృష్ణ, ఎండిఒఒ అనుపమ, విఆర్ఒ నాగరాజు, సెక్రటరీ అంబేద్కర్ సమక్షంలో విచారించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు .

ఊర చెరువులో విష ప్రయోగం

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం గ్రామం కొత్తపేట పంచాయతీ ఊర చెరువులో విషప్రయోగం జరిగింది. చెరువులో గుర్తుతెలీని దుండగులు విషప్రయోగం చేయడంతో చేపలు చనిపోయి నీటిపై తేలిపోయాయి. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి జికెఎస్.రామరాజు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకుని కాళ్ల ఎస్ఐ వీరభద్రరావు చెరువును పరిశీలించారు. ఎంపిడిఒ జి.స్వాతి, ఇఒపిఆర్‌డి ఎంవి భాస్కరరావు చెరువు చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మీసాల శ్రీనివాస్ మాట్లాడుతూ చెరువులో విష ప్రయోగం చేసిన వారిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు. చెరువును పరిశీలించిన వారిలో ఉప సర్పంచి కఠారి లక్ష్మీపతిరాజు, మండల కో ఆప్షన్ సభ్యులు బెనహర్, వార్డు మెంబర్లు మోజేష్, జాన్ పీటర్, సంఘం పెద్దలు గాతల జాన్, భూపతి సాధు సుందర్ సింగ్, గాతల సందీప్, లాజర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జువ్వలపాలెంలో ఊర చెరువును పరిశీలిస్తున్న ఎస్ఐ వీరభద్రరావు

అనర్హులకు పెన్షన్..!

వైకల్యం లేకున్నా పెన్షన్ పొందుతున్న వైనం

ప్రజాశక్తి - వీరవాసరం

వికలాంగుల కోటాలో పింఛన్లు పొందుతున్న వారిలో అనర్హులున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత టిడిపి ప్రభుత్వ పాలన నుంచి నేటి కూటమి ప్రభుత్వం వరకూ దొడ్డిదారిన వికలాంగ ధ్రువపత్రాలు పొందిన కొంతమంది ఈ పెన్షన్లు పొందుతున్నట్లు ఆయా గ్రామాలకు చెందిన కొంతమంది చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వివిధ కేటగిరీల పెన్షన్లు మొత్తం పెంపుదల రాష్ట్ర ఖజానాపై భారం పడడంతో త్వరలోనే ప్రభుత్వం నిజమైన అర్హులను గుర్తించి అనర్హుల పెన్షన్లు రద్దు చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లను పరిశీలన చేయనున్న సమాచారం స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆయా గ్రామాల్లో కొంత మంది అనర్హులు వికలాంగుల కోటాలో పెన్షన్లు పొందుతున్నారన్న సమాచారాన్ని పేరుజెప్పడానికి ఇష్టపడని కొంత మంది బహిర్గతం చేస్తున్నారు. 80 శాతం వికలాంగత్వం కలిగి ఉండి, తెల్లరేషన్ కార్డు ఉన్నవారు, సదరం ద్వారా వికలాంగ ధ్రువీకరణ కలిగినవారు వికలాంగ పెన్షన్ పొందడానికి అర్హులుగా నిబంధనలు ఉన్నాయి. ఇన్ని నిబంధనలు ఉన్నప్పటికీ పైకి కనపడని వికలాంగత్వం కలిగిన వారు వికలాంగ పెన్షన్ పొందుతున్నట్టు చెబుతున్నారు. ఇటువంటి వారంతా వారికి ఉన్న కొద్దిపాటి వికలాంగత్వాన్ని ఎక్కువ శాతం ఉన్నట్టుగా సదరంలోని కొంత మంది అధికారులు ధ్రువీకరించడంతో వారికి ఎటువంటి ఆటంకాలు లేకుండా వికలాంగ పెన్షన్ పొందడానికి మార్గం ఏర్పడడంతో వారంతా వికలాంగ పెన్షన్లు పొందుతున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా మానసికంగా సవ్యంగా లేని వారు కూడా వికలాంగుల కోటాలో పెన్షన్లు పొందే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని కొంతమంది తమకు అనుకూలంగా మార్చుకుని మానసిక వికలాంగులమంటూ పెన్షన్లు పొందుతున్నట్లు స్థానికంగా చెప్పుకుంటున్నారు. ఈ రకమైన పెన్షన్లు పొందుతున్న కొంతమంది ప్రభుత్వ కార్యాలయాల్లో టెంపరరీగా పని చేస్తున్నవారు, డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉన్న వారు ఉండడం గమనార్హం. వీరవాసరం మండలంలో ఇరవై నాలుగు కేటగిరిల్లో 8,706 పెన్షన్లు పొందుతున్నారు. ఇందులో 1,134 మంది వికలాంగుల కోటాలో పెన్షన్లు పొందుతున్నారు. అయితే దీంట్లో అర్హులు ఎంత మందో, అనర్హులు ఎంత మందో పరిశీలనలో తేలాల్సి ఉంది.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

చిన్నారులు ఆటపాటలతో పాటు చదువులో కూడా ముందు ఉండేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఆరోగ్య వర్ధిని ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు సూచించారు. వారిత్రిప్ప గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాంబాబు సమకూర్చిన పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీవుల్ల సూర్య ప్రకాష్‌రావు, గ్రామస్తులు తిరుమాని ఏడుకొండలు, బర్రె నాగరాజు, తిరుమాని వెంకటేశ్వర్లు, దొంగ శ్రీను పాల్గొన్నారు.

కలింగగూడెంలో డెంగీపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఆకివీడు

వాతావరణ మార్పుల నేపథ్యంలో దోమలు విజృంభిస్తున్నాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మలేరియా, డెంగీ, ఫైలేరియాకు దోమలు కారణమన్నారు. అనంతరం కలింగగూడెం గ్రామంలో శుక్రవారం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గ్రామ, మండల ఆరోగ్య వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అకడమిక్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర విద్యాశాఖ సూచించిన ఫార్మాట్‌లో రూపొందించిన ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడే ఉపాధ్యాయ డైరిని గత మూడు సంవత్సరాలుగా మండల యుటిఎఫ్ శాఖ అందించడం అభినందనీయమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి అన్నారు. మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ కాళ్ల మండల ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభి రామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, మండల అధ్యక్షులు, బి.శర్మ.ఎస్. స్వామి, మండల ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్రావు, మహిళా కార్యదర్శి బి.బి.మణి, కోశాధికారి వి.రవికుమార్ రాజు, ఆడిట్ కమిటీ కె.రవిచంద్రకుమార్, జిల్లా కౌన్సిలర్ పి.ఆరోగ్యం, జిల్లా కౌన్సిలర్ టి.బాబ్జీ, కార్యదర్శులు బి.కిషోర్, కె.రామ్మూర్తి రాజు, ఎల్.అప్పలాచార్యులు, పిఎస్.విష్ణుప్రసాద్, ఎంఎస్‌సిహెచ్.వర్మ పాల్గొన్నారు.

క్రికెట్‌లో భారత్ విజయంపై ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వెస్ట్ ఇండీస్‌లో జరిగిన టి-20 క్రికెట్ ప్రపంచ ఛాంపియన్‌గా విజయం సాధించిన భారత జట్టుకు అభినందనలు తెలియజేస్తూ శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో భీమవరంలో జాతీయ జెండాతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అనూరాధ మాట్లాడుతూ 17 ఏళ్ల తరువాత టి-20 వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత్ విజయం సాధించడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఎంఎస్ మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ కప్ భారత గెలుచుకోవడం శుభపరిణామని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ భారత క్రీడాకారుల కృషి అద్వితీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, బార్ ఛాంబర్ సభ్యులు పాల్గొన్నారు.

త్వరితగతిన క్లోరినేషన్ పూర్తి చేయాలి

ఆచంట: గ్రామ పంచాయతీల్లో వాటర్ ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఇఒపిఆర్‌డి మూర్తిబాబు అన్నారు. శుక్రవారం ఆచంటలో వాటర్ ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుధ్యం మెరుగుపరిచేందుకు మండలంలోని 12 గ్రామాల్లో పీఆర్‌ఎస్ యాప్ ద్వారా గ్రామాల్లోని అన్ని చెత్త కుప్పలు (డ్రైయింగ్ జంగిల్) యాప్ వద్ద రిజిస్ట్రేషన్ చేసి వాటిని తొలగించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా తాగునీరు ఒహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను, పబ్లిక్ కుళాయిలను రిజిస్టర్ చేసి సురక్షితమైన తాగునీరు అందించేందుకు అన్ని పంచాయతీలకూ సూచనలు జారీ చేసినట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- తాడేపల్లిగూడెం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి శాయశక్తులా కషి చేస్తానని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఏరియా తాపీ వడ్రంగి సెంటరింగ్ రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి నాయకులు శుక్రవారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న కొత్త ఇసుక విధానం బాగుందని, దానివల్ల గృహ యజమానులకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్మికులకు ఉపాధి పెరుగుతుందని నేతలు ఎంఎల్‌ఎకు ధన్యవాదాలు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, గత ఐదేళ్లుగా బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను పరిష్కరించాలన్నారు. దీనిపై ఎంఎల్‌ఎ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, కార్యదర్శి అత్తిలి బాబీ, కోశాధికారి కోడే సాయి బాలాజీ పాల్గొన్నారు. ముందుగా ఎంఎల్‌ఎను సత్కరించారు.

మాచేనమ్మకు రూ.5.58 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - ఆచంట

పెదమల్లం గ్రామంలో వశిష్ట గోదావరి ఒడ్డున ఉన్న పల్లాలమ్మ మాచేనమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రామచంద్ర కుమార్ తెలిపారు. యాత్రికులు అమ్మవారికి చెల్లించిన కానుకలను లెక్కించగా 103 రోజులకు గాను రూ.5.58 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ సర్పంచి కొండేటి వీరస్వామి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు ఆదిమూల మణికంఠ పాల్గొన్నారు.

వంగవీటికి ఘన నివాళి

నరసాపురం: పట్టణంలో యువత ఆధ్వర్యంలో శుక్రవారం వంగవీటి మోహన్ రంగా 77వ జయంతిని వైఎన్ కాలేజీ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, వంగవీటి రాధ సతీమణి పుష్పవల్లి హాజరయ్యారు. అనంతరం రంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను నాయకర్ కట్ చేశారు. అలాగే సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర కాలేజీ వద్ద మోహన్ రంగా జయంతిని నిర్వహించారు. ఈ క్రమంలో యువత సీతారాంపురం నుంచి నరసాపురం వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

పోడూరు : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా పి.పోలవరం గ్రామంలో గురువారం రాత్రి రక్తదాన శిబిరం ఆశ్రయ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వంగవీటి రంగా అభిమానులు చొప్పవరపు చంద్ర వంశీ, తుమ్మా కరుణాకర్ , తుమ్మా మణికంఠ, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

నేడు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యాన అద్దేపల్లి జయంతి

పాలకొల్లు : పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినెలా జరిగే స్వాతంత్ర సమరయోధులు, విద్యాదాత అద్దేపల్లి సత్యనారాయణమూర్తి జయంతి వేడుకలు శనివారం నిర్వహించనున్నారు. స్థానిక డిఎన్ఆర్ మహిళా కళాశాల ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సభలో ముఖ్యఅతిథిగా ధర్మారావు ఫౌండేషన్ ఛైర్మన్, రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు హాజరవుతారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులను సత్కరించనున్నారు. రక్తదాన శిబిరం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంఎల్‌ఎ నాయకర్

నరసాపురం: జిల్లా కలెక్టరు సి.నాగరాణిని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ నాగరాణికి నాయకర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరసాపురం నియోజకవర్గంలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్‌తో చర్చించారు.

ఏసు కుటుంబానికి సాయం

ఉండి: రక్తనాళాలు దెబ్బతిని ఇటీవల మృతి చెందిన స్థానిక చిక్కాల వీరన్న నగర్ కాలనీకి చెందిన కూతాడ ఏసు కుటుంబానికి పోలేరమ్మ తూర్పు కాపు సంఘం సభ్యులు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మజ్జి కృష్ణ ప్రసాద్, పెంకి దుర్గారావు, పెద్దింటి దుర్గారావు, సోము కన్నయ్య, కంది దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నీటి సరఫరా సక్రమంగా చేయండి

అధికారులకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి ఆదేశం

ప్రజాశక్తి - తణుకు

ఖరీఫ్‌లో పంట కాల్వల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరిగే విధంగా తగుచర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయం వద్ద ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువలు, డ్రెయినేజీల గురించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కాలువల్లో, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క త్వరితగతిన తీసి నీటి సరఫరా సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోవు వర్షాలకు, వరదలకు కాలువ గట్లు, డ్రెయినేజీ గట్లు పరిశీలించి రక్షణ చర్యలు తీసుకోవాలని, డ్రెయినేజీ ఇన్‌లెట్ తలుపులు మరమ్మతులు కూడా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దక్షిణామూర్తి, కిషోర్, కె.శ్రీనివాస్, వరప్రసాద్, అనిల్, బాలమురళీ, హరికృష్ణ, వివేక్, సత్యనారాయణ, జయశంకర్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

10న దేశవ్యాప్త ఆందోళనలో పాల్గొనాలి

తణుకు: లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఈ నెల 10వ తేదీన జరిగే దేశవ్యాప్త ఆందోళనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అమరవీరుల భవనంలో పట్టణంలోని అన్ని కార్మిక (సిఐటియు) సంఘాల ఆధ్వర్యంలో తణుకు మండలం విస్తృత సమావేశం ఎన్.చిన్నారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన రెండు ప్రభుత్వాల కాలంలో మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కార్మికులకు, రైతులకు, ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదని విమర్శించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా రూ.26 వేలు ఇవ్వాలని పోరాడుతున్నప్పటికీ మోడీ ప్రభుత్వం మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. మోడీ విధానాలు ప్రజలకు నచ్చకపోవడం వల్లే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ నెల 10వ తేదీన జరిగే డిమాండ్స్ డేలో ఉద్యోగ, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గుబ్బల గోపి, భారతి, సాయిబాబా, గణేష్, ధనలక్ష్మీ, రంగారావు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వాలు మారుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని, సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు తప్ప మరో మార్గం లేదని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. సిఐటియు అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 10వ తేదీన దేశవ్యాప్తంగా డిమాండ్స్ డే జరుగుతుందని, అందులో భాగంగా మండలంలో కూడా నిరసన కార్యక్రమం జరపాలని శుక్రవారం సిఐటియు మండల కమిటీ నిర్ణయించింది. ఈ సందర్భంగా కరపత్రాన్ని విడుదల చేస్తూ ఆంజనేయులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కాకుండా తన సొంత ప్రయోజనాల కోసం తన అధికారాన్ని ప్రజల మీద రుద్దే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో అంతకుముందు ఉన్న సమస్యలతోపాటు ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తీసుకొచ్చిన సమస్యలు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, విశాఖ ఉక్కును ప్రభుత్వమే పూర్తి సామర్థ్యంతో నడపాలని, తదితర డిమాండ్లతో నిరసన కార్యక్రమం చేపట్టామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు డి.వరలక్ష్మి, పి.నాగరత్నం, సత్యవతి, మద్దాల శ్రీనివాస్, శాంతకుమారి పాల్గొన్నారు.

అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల నుంచి స్ఫూర్తి పొందాలని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య అధ్యక్షులు కాంతేటి వెంకటరాజు అన్నారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం అల్లూరి కాంస్య విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని సమయంలో దేశ స్వాతంత్రం కోసం పోరాడిన ఎందరో పోరాట యోధుల్లో అల్లూరి ఒకరని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అల్లూరి తెగువ పోరాట పటిమ నుంచి యువత స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. గత నాలుగు రోజులుగా 6 హైస్కూల్లోని విద్యార్థులకు అల్లూరి జీవిత విశేషాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామని, గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశామని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, జెఎల్‌బి హైస్కూల్ పిబి.శ్రీనివాస్, నడింపల్లి కృష్ణంరాజు, ఇందుకూరి ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

ఆగస్టు 6, 7, 8 తేదీల్లో కెవిపిఎస్ రాష్ట్రస్థాయి తరగతులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆగస్టు 6, 7, 8వ తేదీల్లో కెవిపిఎస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జిల్లాలో భీమవరంలో నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం, కులనిర్మూలన కోసం నిరంతరం కెవిపిఎస్ పోరాడుతోందన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో ప్రతి దళితపేటకూ 2 ఎకరాలు భూమిని శ్మశానవాటికగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, సహాయ కార్యదర్శులు చిన్నం చిన్నం నాగేశ్వరరావు, మాదాసి గోపి, జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్, గొల్ల ఏడుకొండలు, పి. శ్యాంబాబు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాల కల్పనే లయన్స్ లక్ష్యం

ప్రజాశక్తి - ఆకివీడు

సమాజంలో ఉన్న సగటు వ్యక్తికి అవసరమైన విద్య, వైద్యం కనీస స్థాయిలో తమ శక్తి మేరకు అందించడమే తమ లక్ష్యమని లయన్స్ క్లబ్ ఆకివీడు నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కంభంపాటి లక్ష్మీ నరసింహం అన్నారు. శుక్రవారం స్థానిక లయన్స్ హాల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి గాను నూతనంగా ఏర్పాటైన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 7వ తేదీ ఆదివారం సాయంత్రం స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో జరుగుతుందని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు, గోల్డెన్ ఆక్వా లైన్స్ క్లబ్, చినకాపవరం లయన్స్ క్లబ్ మూడు క్లబ్‌లకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గాలు పదవీ ప్రమాణ స్వీకారం చేస్తాయని చెప్పారు. గోల్డెన్ ఆక్వా అధ్యక్షులుగా వేగేశ్న చిలక రామరాజు, కార్యదర్శిగా కొప్పర్తి మణికంఠ, కోశాధికారిగా పిన్నమరాజు చిరంజీవి రాజులు ఎన్నికయ్యారని తెలిపారు.

నేటి మొక్కే రేపటి వృక్షం

జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నేడు మనం నాటిన చిన్న మొక్కే మహా వృక్షమై ఎందరికో ప్రాణం వాయువును అందిస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ సి వి ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శుక్రవారం వన మహోత్సవాన్ని పురస్కరించుకొని పెదఅమిరంలో ఉన్న వెస్ట్ బెర్రీ హైస్కూల్లో వేడుకలు వారం రోజులుగా జరుగుతున్నాయి. వేడుకల ముగింపు సందర్భంగా శుక్రవారం జెసి సివి ప్రవీణ్ ఆదిత్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనాడు నాటిన ఈ చిన్న విత్తనాలు రేపు మహావృక్షాలుగా మారి ప్రజలందరికీ ఆరోగ్య వాతావరణాన్ని సృష్టిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు పర్యావరణంపై నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సారా స్మిత, పాఠశాల డైరెక్టర్ శ్రీమహేష్ కుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం చేనేతను, ఆ కులస్తులను ఆదుకోవాలని దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వట్టం గణేష్ కోరారు. శుక్రవారం మార్టేరులోని శ్రీ గౌరీ శంకర కళ్యాణ మండపం వేదికపై జరిగిన దేవాంగ సంక్షేమ సంఘం మొదటి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ నెల 14వ తేదీన ఉచిత మెగా మెడికల్ క్యాంపు పాలకొల్లులో నిర్వహిస్తామని అన్నారు. జిల్లాలోని దేవాంగ సంఘాలను బలోపేతం చేస్తానని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు మన కమ్యూనిటీలో సుస్థిర స్థానం కల్పించాలని తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఆల్ ఇండియా వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు (పెడన) బండారు ఆనంద్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయాక బీసీలలో అధికంగా చేనేత కులస్తులు ఉన్నారని ప్రభుత్వం గుర్తించి తగిన ప్రాధాన్యత నివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర దేవాంగ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి మాడిశెట్టి శివ శంకరయ్య (ప్రొద్దుటూరు) మాట్లాడుతూ దేవాంగ పిల్లలను ప్రతి ఒక్కరినీ చదివించి ఉన్నత స్థాయికి నడిపించవలసిన బాధ్యత తల్లిదండ్రులదేనని వివరించారు. కోనసీమ జిల్లా సంఘం అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా సంఘం అసోసియేటెడ్ ప్రెసిడెంట్ బండ్ల బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వార హేమకుమార్, ట్రెజరర్ అల్లాడ కుమారస్వామి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ మానెం బసవరాజు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమ నేత అల్లూరుకు ఘన నివాళి

ప్రజాశక్తి - నరసాపురం

కార్మిక ఉద్యమ నేత, సిపిఎం సీనియర్ నాయకులు అల్లూరు సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమని సిఐటియు పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల త్రిమూర్తులు అన్నారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన 10వ వర్థంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తొలుత అల్లూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ కార్మిక సంఘాలు జిల్లాలో పెట్టడం, సమస్యలు తీసుకుని పనిచేయడంలో ఎక్కడా రాజీ పడేవారు కాదన్నారు. కార్మిక హక్కులు సాధించి అమలుకు కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలు సాధించడమే మనమిచ్చే ఘన నివాళని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, అడ్డాల రమేష్ పాల్గొన్నారు.

బాధితునికి 'వసుధ' సాయం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జిన్నూరు గ్రామానికి చెందిన సాయి దుర్గా శ్రీనివాసరావు ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత ఆ కటుంబానికి లేకపోవడంతో విషయాన్ని వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటరామరాజు తెలిపారు. స్పందించి ఫౌండేషన్ సభ్యులు రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ చెక్కును ఈరోజు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు జిన్నూరు గ్రామంలో పి.బాపిరాజు భవనం వద్ద జరుగుతున్న టైలరింగ్ యూనిట్ సభ్యుల సమక్షంలో అందజేశారు. సహాయానికి శ్రీనివాస్ తల్లిదండ్రులు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ ట్రైనింగ్ టీచర్ బి.అరుణ పాల్గొన్నారు.

ప్రజలకు శుద్ధి జలాలు అందించాలి

అధికారులకు ఎంఎల్‌ఎ నాయకర్ ఆదేశం

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలకు శుద్ధి జలాలు సరఫరా చేయాలని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. కెపి.పాలెంలోని సమగ్ర రక్షిత నీటి పథకాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పథకం వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఫిల్టర్ బెడ్లను, పంప్ హౌస్‌లు పరిశీలించారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పైప్‌లైన్ లీకేజీలు వెంటనే అరికట్టాలని ఆయన సూచించారు. శివారు ప్రాంతాల వరకూ తాగునీరు సక్రమంగా అందేలా చూడాలన్నారు. డిఇ శ్రీనివాసరావు, ఎఇ మోహన్, సర్పంచి అందే లక్ష్మి, మాజీ సర్పంచి మేళం బన్ను, అందే దొరబాబు, సత్తినేని త్రినాధ్, వాతాడి కనకరాజు, పలువురు టిడిపి, జనసేన బిజెపి నాయకులు ఉన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తణుకు

O.S.No.479/2020

బిట్వీన్ :
బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆలమూరు బ్రాంచి ...వాది
మరియు
వేముల సీత మరియొకరు ...ప్రతివాదులు

To.
Defendant No.1 : Vemula Sita, W/o.Krishna, H/FM, Age.37 Yrs, Agriculture, Gaggiparru (V), Elamanchili Mandal, W.G.Dt., A.P.
Defendant No.2 : Thonta Srinivasa Rao, S/o.Rama Rao, H/M, Agriculture, Sambhunipeta, Palakollu, Palakollu (M), W.G.Dt., A.P.

పై నంబరు దావాలో ప్రతి వాదులయిన మీరు కోర్టు వారు పంపిన నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.12.07.2024**వ తేదీకి వాయిదా వేసినారు. కావునా ఆరోజు ఉదయం 10.30 ని॥లకు మీరు శ్రీపైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

CH.Durga Poornima
Advocate, Eluru.
Cell: 7386441140

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 105/2019

బిట్వీన్:
విజయా బ్యాంకు, (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా), నరసాపురం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం **-వాది**
అండ్
పీతాని పద్మావతి అండ్ అనదర్
-ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: పీతాని పద్మావతి, W/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 3-90, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: మాదేటి నరశింహస్వామి, S/o. రామానుజయ దాసు, డోర్ నెం. 4-118, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది విజయ బ్యాంక్ (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా) నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-7-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: -07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.7/2014

వాది: పుచ్చకాయల నవీన్
Vs
ప్రతివాదులు : పుచ్చకాయల కృష్ణమూర్తి (Died) వగైరా

నోటీసు

9వ ప్రతివాది : నల్లి సోనీ, భర్త నాని, మేడపాడు గ్రామము, యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు O.S.No.7/2017, 9వ ప్రతివాది అయిన మీకు పైకోర్టు నుండి ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినను అమలు జరగనందున ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మీరు **ది.18-07-2024వ తేదీన ఉదయం 10.00 ని॥లకు** శ్రీకోర్టు వారి ఎదుట స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని, హాజరు అయ్యి మీ అభ్యంతరములు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు పై దావాని మీ పరోక్షమున తీర్మానించబడును, గాన మీకు తెలియజేయడమైనది.
కోర్టు ఉత్తర్వుల ప్రకారం

దేవ రంజిత్ కుమార్, చొప్పల అశోక్
నర్సాపురం వాది తరపున అడ్వకేట్స్, నర్సాపురం.
తేది.5-7-24 సెల్: 9848332116

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 52/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
వేముల స్వాతి అండ్ అనదర్
-ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: వేముల స్వాతి, D/o. రాజేశ్వరరావు, డోర్ నెం. 4-85, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల సుశీల, W/o. రాజేశ్వరరావు, డోర్ నెం. 4-85, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-7-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: -07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 170/2019

బిట్వీన్:
విజయా బ్యాంకు, (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా), నరసాపురం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం **-వాది**
అండ్
పీతాని పద్మావతి అండ్ అనదర్
-ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: పీతాని పద్మావతి, W/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 3-90, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది విజయ బ్యాంక్ (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా) నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-7-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: -07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 151/2019

బిట్వీన్:
విజయా బ్యాంకు, (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా), నరసాపురం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం **-వాది**
అండ్
మర్నీడి కవిత అండ్ అనదర్
-ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: మర్నీడి కవిత, W/o. శివరామకృష్ణ, డోర్ నెం. 2-47, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది విజయ బ్యాంక్ (ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా) నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-7-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: -07-2024 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 122/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
వేముల వెంకటరత్నం గాంధీ అండ్ అనదర్
-ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: వేముల వెంకటరత్నం గాంధి, S/o. మోహనరావు, డోర్ నెం. 4-118, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల నాగలక్ష్మి, W/o. వెంకటరత్నం గాంధి, డోర్ నెం. 4-118, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 12-7-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది: -07-2024 ఫోన్: 08814-274628